ఇళ్లలోకి వెళ్లేదెట్లా ?

- కట్టలింగంపేటలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇళ్లముందు దారి
- నాలుగేళ్లుగా గ్రామస్తుల నరకయాతన
- పలుసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తిపేరు కొంక మహేందర్. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు గ్రామ శివారులోని చెరువు నిండి మత్తడి ద్వారా వెళ్లే వరద నీటితో తన ఇంటిముందు ఉన్న దారి కొట్టుకుపోయింది. ఇటీవలే గల్ఫ్ నుంచి ఇంటికొచ్చానని, తమ ఇంట్లోకి వెళ్లేందుకు ఒర్రెలోంచి దిగి ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నామంటూ వాపోతున్నాడు. పాలకులపై నమ్మకం లేక రూ.50వేలకు పైగా సొంత ఖర్చుతో ఇనుప వంతెనను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుపుతున్నాడు.



ఇంట్లోకి వెళ్లేందుకు ఒర్రెపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన



ఒర్రెపై స్తంభాలు వేసి వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేటలో నాలుగేళ్ల క్రితం కురిసి భారీ వర్షాలకు గురునాథం చెరువు మత్తడితో గ్రామంలోని నాలుగో వార్డులో రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటినుంచి మరమ్మతులు చేస్తారని ఎదురుచూసి వేసారిపోయిన గ్రామస్తులు ఆర్థికంగా లేనివారు తాత్కాలిక రోడ్డు కోసం విరిగిన విద్యుత్ స్తంభాలు వేసుకొని నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు ఒర్రెలోంచి నడక కొనసాగిస్తున్నారు. ఏటా వానాకాలంలో భారీవర్షాలు కురిస్తే ఇళ్ల పక్కన ఉన్న భూమి కోతకు గురై ఇళ్లు ఎక్కడ కూలిపోతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వం మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చినా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. సుమారు కిలోమీటర్ పొడవునా మత్తడి నీటివరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. ఈదారి పొడవునా గ్రామంలో 30కి పైగానే ఇళ్లు ఉన్నాయి. ఒర్రెపై కర్రలతో కొందరు, మరికొందరు విరిగిన విద్యుత్ స్తంభాలతో, ఇనుపరాడ్లతో వంతెన ఏర్పాటు చేసుకున్నారు.

మరమ్మతులు శూన్యం

గతంలో మత్తడి నీటిద్వారా కొట్టుకుపోయిన దారికి మరమ్మతు చేయాలని స్థానికులు గతంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ, నీటి పారుదలశాఖ అధికారులకు విన్నవించినా తమ పరిధి కాదని తప్పించుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు తమ శాఖలో నిధులే లేవని, ఇరిగేషన్ శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేసినా ప్రభుత్వం నిధులు మంజూరుచేయకపోతే పనులు ఎలా చేయిస్తామంటూ చేతులెత్తేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

'ఆది' పైనే ఆశలు

చెరువు మత్తడి నీటితో కొట్టుకుపోయిన దారిలో ప్రజలు పడుతున్న ఇబ్బందిని చూడలేక అప్పటి డీసీసీ, ఇప్పటి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సొంత డబ్బులతో గతేడాది మరమ్మతులు చేయించారు. ఇప్పుడు వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో తమ కష్టాలు తీరుతాయని ఆశ ఎదురుచూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



చెరువు మత్తడి నీటి ఉధృతికి కొట్టుకుపోయిన దారికి మరమ్మతులు చేపట్టేందుకు దారి పొడవునా కొలతలు చేపట్టాం. ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి నెలరోజుల క్రితమే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ఎమ్మెల్యే సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం

–వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, చందుర్తి



సిరిసిల్ల: బోయినపల్లి మండలం అనంతపల్లి–నల్గొండ గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రోడ్డు కంకరతేలి, తారు చెదిరిపోయి అధ్వానంగా మారింది. పదేళ్లుగా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా రోడ్డును నిర్మించి ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మహేందర్, బోయినపల్లి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: లక్ష్మణ్‌రావు, పంచాయతీ రాజ్ డీఈఈ వేములవాడ ఫోన్ నంబర్ : 94403 36754

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నేతలు



సిరిసిల్లటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను గురువారం సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మ్యాన ప్రసాద్, చొప్పదండి ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న శివరాజ్, తదితరులు

ముస్తాబాద్: మాలల హక్కుల కోసం కలిసి ఉద్యమించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజ్ అన్నారు. పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తలారి రాణినర్సింలు, డైరెక్టర్‌గా నియమాకమైన క్యారం రాజును మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ మాలలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ప్రభుత్వాలు మాలలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ భూమరాజం, జక్కుల యాదగిరి, యారాటి కరుణాకర్, ఈసరి కృష్ణ, కొప్పు రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మానేరు కెనాల్‌పై వంతెన నిర్మిస్తాం

సాక్షి స్పందన

ముస్తాబాద్: ముస్తాబాద్–పోతుగల్ రహదారిలో మానేరు కెనాల్‌పై వంతెనను త్వరలో నిర్మిస్తామని ఆర్అండ్‌బీ ఈఈ శాంతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ ఈఈ స్పందించారు. కెనాల్‌పై ప్రమాదకరంగా వున్న వంతెన విస్తరణ పనులు చేపడుతామన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



సాక్షి స్పందన

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో గేటుకు తాళం వేయడంపై అధికారులు స్పందించారు. గురువారం ×శ్మశానవాటిక దారి గేటుకు తాళం౯ అనే శీర్షికన ×సాక్షి౯లో కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి గ్రామానికి వెళ్లి తాళాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల రైతులతో మాట్లాడారు. శ్మశానవాటికకు దారి ఇవ్వడంతో తమ భూములు కోల్పోయామని, తమకు పరిహారం అందలేదని వారు వాపోయారు. దీంతో వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గేటుకు తాళం తీయించారు.

బెల్టుషాపులను తొలగించాలి

కోనరావుపేట: గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ దుకాణాలు ఎత్తివేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు జవ్వాజి విమల డిమాండ్ చేశారు. మండకేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. బెల్టుషాపులతో మహిళలు, కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అధికారులు గ్రామాల్లో బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

పేదలకు పనిముట్ల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు వివిధ రకాల పనిముట్లను అందించారు. మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోట సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.70వేల విలువైన 3 కుట్టుమిషన్లు, 4 సైకిళ్లు, రెండు క్రిమిసంహారక పిచికారీ డబ్బాలను పంపిణీ చేశారు. ఇటీవల నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. సెక్రటరీ నాయిని భాస్కర్‌రెడ్డి, ట్రెజరర్ రావుల లింగారెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పయ్యావుల రామచంద్రం, సభ్యులు ముత్యాల శ్రీ నివాస్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, కొలనూరు శంకర్, బోయిని మహాదేవ్, రావుల మల్లారెడ్డి, పార్టీ దేవయ్య, మల్లేశ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి పాత్తూరి రాజు కళాబృందం ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పాటల ద్వారా వివరించారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



తంగళ్లపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోనరావుపేట: చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. గురువారం మండలంలోని జిల్లెల్ల, చిన్నలింగాపూర్ గ్రామాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు అరెపల్లి బాలు, పరుశరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రూ.15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 28 మందికి గురువారం పంపిణీ చేశారు. ఇక్కడ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్మల రాంరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు తలారి నర్సింలు, గుండెల్లి శ్రీను, రమణారెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, నరేశ్, కొంరయ్య, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాను, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధు తదితరులున్నారు.

కోనరావుపేట: సీఎం సహాయనిధితో గ్రామాల్లోని నిరుపేదలకు ప్రయోజనం కలుగుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అన్నారు. గోవిందరావుపేటతండా (బావుసాయిపేట)కు చెందిన భుక్యా సాయికుమార్‌కు మంజూరైన రూ.23,500 విలువైన చెక్కును అందజేశారు. ఇక్కడ భుక్యా తిరుపతినాయక్, భుక్యా మధన్, శ్రీనివాస్, గుగులోత్ బన్సీలాల్, తిరుపతి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపద సమయంలో సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందన్నారు. ఏఎంసీ డైరెక్టర్ బాలయ్య, నాయకులు రాజయ్య, ఎల్లయ్య, నాగరాజు, పవన్‌రెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

● **కోతిపిల్లకు చికిత్స**



వేములవాడ అర్బన్: రాజన్న ఆలయ ప్రాంగణంలో కోతిపిల్ల ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉంది. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెంటనే గోశాలలో విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులను పిలిపించి చికిత్స చేయించారు.

● **కేంద్ర మంత్రి 'బండి'ని దూషించిన వ్యక్తిపై కేసు**

సిరిసిల్లటౌన్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సోషల్‌మీడియాలో దూషిస్తూ పోస్టులు చేసిన హరీశ్‌రెడ్డిపై జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆఫీస్‌లో గురువారం కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

● **విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి**

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పాలనలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని శివాని డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్‌వీ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పది నెలలుగా విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా సీఎం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికై పోరాటం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మెట్టెల సాయి, దీపక్, వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

● **నిత్యావసరాలు అందజేత**

ఎల్లారెడ్డిపేట: ముగ్గురు పిల్లలతో ఒంటరిగా ఉంటున్న మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన మహమ్మద్ బీబీ కుటుంబానికి సెస్ విద్యుత్ సిబ్బంది అండగా నిలిచారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఈ పృథ్వీ చేతుల మీదుగా నెలరోజులకు సరిపడా సరుకులు, బియ్యం అందజేశారు. సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీరాజం, దేవేందర్, లైన్‌మన్, అసిస్టెంట్ హెల్పర్స్ బాబు, రమేశ్, శ్రీనివాస్, సతీశ్, పాల్గొన్నారు.

● **టీబీపై అవగాహన**

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి, అనంతగిరి, రేపాకలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సబ్ సెంటర్లలో గురువారం ఆరోగ్య సిబ్బందికి టీబీ నివారణపై ఇంపాక్ట్ ప్రోగ్రాం అధికారి దండబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● **పుస్తెమెట్టెలు అందజేత**

చందుర్తి : మండలకేంద్రానికి చెందిన మేడిశెట్టి విజయ శంకర్ దంపతుల కూతురు వివాహానికి చందుర్తి కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు తోట నాగరాజు మీదుగా శుక్రవారం పుస్తెమెట్టెలు అందజేశారు.

● **టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక**

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మనపల్లి నరేశ్, ఉపాధ్యక్షుడిగా పసుల సత్తయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుతారి పద్మ, కోశాధికారిగా అలువాల నవ్యలు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు వ్యవహరించారు.

● **ఉపాధ్యక్షుడిగా మహేశ్**

తంగళ్లపల్లి: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర నూతన కార్యవర్గంలో మండలానికి చెందిన పద్మశాలీ నాయకులు చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా (ప్రభుత్వ వ్యవహారాల ఇన్‌చార్జి) గుంటుక మహేశ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా అంకారపు మహేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామకపత్రాన్ని అందజేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

వేములవాడఅర్బన్: వేములవాడ డివిజన్ పరిధిలోని దీపావళి పటాకుల దుకాణాల లైసెన్స్ కోసం శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్డీవో రాజేశ్వర్ ప్రకటనలో గురువారం తెలిపారు. వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయండి



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ప్రారంభిస్తున్నా ఇంకా కొనుగోళ్లు మాత్రం ప్రారంభించలేదని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు గన్నీ సంచులు లేవన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, కార్యకర్తలు వెంకటేశం, కేపీఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వల్లంపట్లలో ఇటీవల నాయిని వంశీ అనే యువకుడు మృతిచెందగా బాలిక సంజనను ఆయన పరామర్శించారు.

డిజిటల్ సేవ కామన్ సర్వీసెస్ సెంటర్ ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ సేవ కామన్ సర్వీసెస్ సెంటర్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. నీలం శేఖర్, వాసాల డాక్టర్ శ్రీనివాస్, ఆక్రమ్, రాజేందర్, జడల చిన్న శ్రీనివాస్, రాజయ్య, బొజ్జ శ్రీనివాస్, దండుగుల తిరుపతి, నాగరాజు, నజీం, షాహిద్ పాషా, మల్లేశం, అనిల్, దేవరాజు తదితరులున్నారు.

ఆర్ఎంపీ కూతురుకు ఎంబీబీఎస్ సీటు



ఎల్లారెడ్డిపేట: ఆర్ఎంపీ కూతురు ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన పాముల శ్రీనివాస్–లత దంపతుల కూతురు పావని నీట్‌లో ప్రతిభ కనబరిచింది. పటాన్‌చెరువులోని టీఆర్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. తండ్రి శ్రీనివాస్ ఆర్ఎంపీ వైద్యుడు, తల్లి లత గృహిణి. పావని పదో తరగతి వరకు మండలంలోని విజ్ఞాన్ స్కూల్, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదివింది. తన తండ్రి పాతికేళ్లుగా ఆర్ఎంపీగా చేస్తున్న వైద్యసేవలను చూస్తూ ప్రేరణ పొంది ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు విద్యార్థిని తెలిపింది. పావని సోదరుడు పవన్ సాయి సైతం ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఆర్ఎంపీ శ్రీనివాస్ పిల్లలు ఇద్దరు ఎంబీబీఎస్ చదువుతుండడంతో గ్రామస్తులు అభినందించారు.

ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన



వేములవాడఅర్బన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ వీరప్రసాద్



వీర్నపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎల్లయ్య గౌడ్

వేములవాడఅర్బన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం టౌన్ సీఐ వీరప్రసాద్ నిర్వహించారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పోలీసు చట్టాలు, కేసుల ఛేదనచ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాలు, ఫింగర్ ప్రింట్ డివైస్, షీటీం, డయల్ 100 గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించినట్లు తెలిపారు. రిసెప్షన్ విధులు, ఫింగర్ ప్రింట్, బ్లూకోల్ట్స్, డయల్ 100, షీటీం, భరోసా సెంటర్, పోలీస్‌శాఖలో ఉపయోగిస్తున్న ఆయుధాలు, పోలీస్ రికార్డ్స్, పోలీస్‌స్టేషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. ఎస్సై మారుతి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులకు ఏఎస్సై బాపు ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. పోలీసుల వినియోగించే వైర్‌లెస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన, లాకప్ రూం, ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్ విధుల నిర్వహణపై వివరించారు. కార్యక్రమంలో నవత విద్యాలయం కరస్పాండెంట్ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు, రిసెప్షన్ సెంటర్, లాకప్, రైటర్ రూం, ఆయుధాల గురించి వివరించారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఎఫ్ఐఆర్ నమోదు, ఫింగర్ ప్రింట్ డివైస్, షీటీం, డయల్ 100, తదితర వాటిపై ఎస్సై ఎల్లయ్య గౌడ్ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయుధాలు, పోలీసు విధులపై అవగాహన కల్పించారు పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి కృష్ణహరి పేర్కొన్నారు. జోనల్‌స్థాయి క్రీడలకు ఎంపికైన రాచర్ల బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాల విద్యార్థులను గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఐ.గణేశ్, కరీంనగర్ జోనల్ స్థాయి అండర్–17 బాలుర విభాగంలో సనీత్, ఖోఖోలో జి.భానుప్రసాద్, అండర్–14 ఖోఖోలో నవనీత్, అండర్–14 బాలికల విభాగంలో జిల్లా స్థాయిలో తన్విక, లాంగ్‌జంప్‌లో రవిప్రకాశ్ ఎంపికయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ, పీఈటీలు అరుణ్, మధులత పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట నుంచి పక్కకు నిలిపిన కారు

సాక్షి స్పందన

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా కారును పార్క్ చేయడంతో గురువారం ×కార్యాలయం ఎదుటే కారు పార్కింగ్౯ అనే శీర్షికన ×సాక్షి౯లో కథనం ప్రచురితమైంది. దీనిపై అడ్డుగా ఉన్న కారును సంబంధిత అధికారి పక్కన నిలిపారు. అధికారులు అడిగిన నివేదికకు వివరణ ఇచ్చారు.

● **విద్యుత్ మరమ్మతు పనులు**

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని 11 వార్డులో విద్యుత్ స్తంభాలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక కౌన్సిలర్ ఒగ్గు ఉమా రాజేశంకు తెలిపారు. స్పందించిన కౌన్సిలర్ సెస్ అధి కారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయించారు.

3న డీఎస్పీ మహాసమ్మేళనం

సిరిసిల్లటౌన్: ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనం పోస్టర్లను గురువారం సిరిసిల్లలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గద్దం హరీశ్‌గౌడ్ ఆవిష్కరించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం పార్టీ పోరాడుతుందన్నారు. నవంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే మహా సమ్మేళనానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. శ్రీకాంత్, పరమేశ్వరీ, బాబు, అరుణ్, అమర్, గోవర్ధన్, సురేశ్, మధు, ప్రవీణ్, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కాలె నారాయణరెడ్డిని గురువారం మండలంలోని పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి జంగం అంజయ్య, సీనియర్ నాయకులు సంబ లక్ష్మీరాజం, గడ్డం తిరుపతిరెడ్డితో పాటు నీలోజిపల్లి సింగిరెడ్డి బాలమల్లు తదితరులు తహసీల్దార్‌ను సన్మానించారు. రేషన్ల డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, వెంకటరెడ్డి, సురేశ్‌బాబు తదితరులు పుష్పగుచ్ఛం అందించారు.